www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 26 | 25-03-2024 | పుటలు : 4

## మార్చి 25
## హెూళీ శుభాకాంక్షలు!!

హెూళీ అనేది రంగుల పండుగ. వసంత కాలంలో వచ్చే ఈ పండుగను భారత దేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్, ప్రవాస భారతీయులు కూడా జరుపుకుంటారు. భారత దేశంలోని పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లలో దీన్ని దోల్‌యాత్రా (దోల్ జాత్రా) లేదా బసంత-ఉత్సబ్ ("వసంతోత్సవ పండుగ") అని అంటారు. మన దేశంలో హెూళీ పండుగకు విశిష్ట ప్రాముఖ్యం ఉంది. ఈ పండుగ ప్రతి ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున వస్తుంది. ఈ పండుగను కుల మతాలకు అతీతంగా జరుపుకుంటారు. చిన్నా.. పెద్దా అంటూ ఎటువంటి భేదభావాలు చూపకుండా ప్రజలు ఈ హెూళీని సెలబ్రేట్ చేసుకుంటారు. హెూళీ సందర్భంగా చెప్పుకునే కథలు చెడుపై మంచి విజయం సాధించిన కథలు.. మనం కష్టాలను అధిగమించడానికి అవి స్ఫూర్తిని నింపుతున్నాయి.

**అందరికీ హెూళీ శుభాకాంక్షలు!!**

**- నన్నయవాణి**

# కిక్ బాక్సింగ్‌లో నన్నయకు కాంస్య పతకం



ఆల్ ఇండియా యూనివర్సిటీస్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి సిహెచ్ దినేష్ కాంస్య పతకాన్ని సాధించారని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో దినేష్ కు కాంస్య పతకాన్ని ప్రదానం చేసి అభినందించిన వీసీ పద్మరాజు వివరాలు తెలియజేశారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీస్ జాతీయ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సిహెచ్ దినేష్ కిక్ బాక్సింగ్ అథ్లెట్ 81 కేజీల బరువు విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. దినేష్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల అయిన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడని తెలిపారు. ఎంతో కృషి పట్టుదలతో క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ యువతకు దినేష్ స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, కల్నల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ డా.బి.మధు కుమార్, రాజోలు కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్.సి.సి. ఉన్నతాధికారిని కలిసిన వీసీ పద్మరాజు

ఎన్.సి.సి. ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ అసిస్టెంట్ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్) లెఫ్టినెంట్ కల్నల్ సంజయ్ గుప్తాను వీసీ ఆచార్య కె పద్మరాజు కలిశారు. హైదరాబాదు కార్యాలయంలో సంజయ్ గుప్తాను కలిసిన వీసీ పద్మరాజు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్.సి.సి. యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన విషయాలను చర్చించారు. విశ్వవిద్యాలయంలో ఎన్.సి.సి. యూనిట్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

# కాకినాడ క్యాంపస్‌లో ఓటు హక్కుపై అవగాహన సదస్సు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతిశ్రీ అధ్యక్షతన" సస్టైనబుల్ యూస్ ఆఫ్ ఓటర్ అండ్ ఓట్ ఇన్ ఏ సస్టైనబుల్ డెమోక్రసీ" అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత మానవాళికి రోజూ నీరు ఎంత అవసరమో మన మనుగడ కోసం మనకు ఎన్నుకునే అధికారం ఓటు హక్కు ద్వారా రాజ్యాంగం కల్పించిన ఒక అద్భుతమైన అవకాశం, అట్టి వాటిని యువతగా మీరు సరియైన క్రమంలో నిర్వహించాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీచర్స్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ శ్రీ ఐ.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మనకి ఉన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులను వర్గాల ఆధారంగా ఏ విధంగా అస వ ా న త ె ల క ె ం గురవుతున్నాయి, ప్రస్తుత కాలంలో యువత వారి యొక్క ఓటు హక్కును ఉపయోగించి భారతదేశ అభివృద్ధిలో ఏ విధంగా పెంపొందించుకోవాలి, అలాగే ప్రాణాధారమైన ప్రకృతి మనకి ఇచ్చిన నీటిని ఏ విధంగా కాపాడుకోవాలి అనే అంశాలను కొన్ని ప్రశ్నల ద్వారా విద్యార్థులతో సంభాషించారు. మరొక ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఎన్టీయూ అధ్యాపకులు ఆలపాటి శ్రీనివాస్ ప్రస్తుత కాలంలో ఉన్న చట్టాలను గౌరవిస్తూ యువత తమ ఓటు హక్కును ,అలాగే ప్రత్యక్ష రాజకీయాల్లో ఏ విధంగా యువత భాగస్వామ్యులు అనే అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఎం .పోచయ్య, డా.ఎం.నాని బాబు, డా.జోసెఫ్ స్టీఫెన్, డా.హారిక, డా.విజయశ్రీ, డా.అప్పారావు, డా.మధుకుమార్, శ్రీనివాస్ రావు తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు





# క్యాంపస్‌లో మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి. విజయనిర్మల మరియు ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్. ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# రంగుల ప్రపంచం!

జీవితాన్ని రంగులమయం చేసుకోవటం మన చేతుల్లోనే ఉంది. ప్రతి మనిషి తన జీవితాన్ని,తనను తాను ఉన్నత స్థితికి తీసుకెళ్లే సామర్థ్యమే కాకుండా సమాజ సమష్టి చైతన్యాన్ని కూడా ఉన్నత స్థితికి తీసుకెళ్లగలిగే శక్తిని కలిగి ఉంటాడు.ఇందులో సందేహమే లేదు. "ఈరోజు" అనేది మనకు లభించిన కానుక. దానిని సరైన దినచర్యతో సద్వినియోగం చేసుకోవటమే మనం చేయగలిగిన పని. మనం వాహనాన్ని నడపాలనుకున్నప్పుడు రోడ్డు మీద ఉండే ఆటంకాలని, ఇబ్బందుల్ని, ట్రాఫిక్ జామ్ ని భరించక తప్పదు. 'చెయ్యలేం' అనే ఉద్దేశాన్ని కలిగి ఉండటం వలన కొన్ని మనం చెయ్యం. 'చెయ్యగలం' అనే అలవాటుగా మారటానికి కొంత అభ్యాసం కావాలి. ప్రపంచం ఎలా ఉన్నా మనం ఆనందంగా ఉండటం మన చేతుల్లోనే ఉంది. దానికి చేయాల్సింది ప్రపంచాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించి దాని పట్ల మన వైఖరిని మార్చుకోవడం.

తెల్లబట్టలు వేసుకున్నంత మాత్రాన వాళ్ల మనసు స్వచ్ఛమైందని అర్థం కాదు. అలాగని పూలచొక్కా వేసుకున్నంత మాత్రాన పోకిరి అని కూడా కాదు. కాషాయం కట్టుకుంటే ఆధ్యాత్మికవేత్త అని అసలే కాదు. సమగ్ర మూర్తిమత్వం అన్నప్పుడు కేవలం డ్రెస్ మాత్రమే కాదు. మాట, ప్రవర్తన, ఇతరుల పట్ల వైఖరి...ఇవన్నీను. ఈ ప్రపంచం ఎలా ప్రవర్తిస్తోందనేది మనకు సంబంధించిన విషయం కాదు. మన వ్యక్తిత్వంతో మనం జీవించడమే ముఖ్యం. అది ఆత్మాభిమానంతో కావచ్చు, భావోద్రేకాలను నియంత్రించుకుంటూ కావచ్చు.

సరైన చదువు, దినచర్య, అభ్యాసం...ఇవేకదా మనం ఎదగడానికిగల గొప్ప సూత్రాలు. మరొక విషయం.. మనకు మనమే అత్యంత విలువైన "వనరు". దానిని సద్వినియోగం చేసుకోవటం వల్లనే మనకొక అందమైన ప్రపంచం ఏర్పడుతుంది. మనల్ని మనం సరైన పద్ధతిలో వినియోగించుకున్నామా,లేదా అని ఒకసారి ప్రశ్నించుకోవాలి. ఇతరులను వాడుకోవటం కాదు.మనల్ని మనం తగినంతగా వాడుకుంటున్నామా... అని పదే పదే ప్రశ్నించుకోవాలి. మన పరిధి చాలా పెద్దది. దాని నిండా కావలసినంత నింపుకోవచ్చు. మనసు నిండా ఒంపుకోవచ్చు. మన నైపుణ్యాలను మన పరిధి నిండా వినియోగించుకున్నప్పుడే ఇంద్రధనుస్సులో ఏడు రంగులు స్పష్టంగా కనిపిస్తాయి.అవి బయట ఆకాశంలో కాదు, మనలోనే ఉన్నాయని అర్థమవుతుంది. ఆ రంగుల ప్రపంచంలో మనమే రారాజు, మనమే విజేత, మనమే గొప్ప వ్యక్తి,మనదే సమగ్రమైన మూర్తిమత్వం!!

ముఖ్యంగా విద్యార్థి దశలో అభ్యాసం, నైపుణ్యాలను మెరుగు పరచుకోవటం, విస్తృతమైన అధ్యయనం, నిర్మలమైన మనసు, మనం ఏమి అవ్వాలని అనుకుంటున్నామో దాని పట్ల అవగాహన, సమయపాలన, సరైన వైఖరి ఇదే అంతర్గతమైన ఇంద్ర ధనుస్సు! ఇవే జీవితానికి సంబంధించిన రంగులు!ఇదే హొలీ!! హొలీని పరిపూర్ణంగా అనుభవించండి.అవును... జీవితం స్వచ్ఛమైన రంగులమయం కాబోతుంది.జయహో!!.

# కాకినాడ క్యాంపస్‌లో పోయెట్రీ డే




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ వారిచే ప్రపంచ పోయెట్రీ రోజుని పురస్కరించుకొని క్యాంపస్ లో గల "చొమ్స్కి లాంగ్వేజ్ క్లబ్" విద్యార్థి విభాగం వారు క్యాంపస్ లోని విద్యార్థులకు ఇంగ్లీషు మరియు తెలుగు భాషలలో పోయెట్రీ రచన పోటీలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతి శ్రీ, విభాగాధిపతి ఎం పోచయ్య అధ్యాపకులు హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఫార్మసీ పేపర్ ప్రచురణ



ఆదికవి నన్నయ యూనివర్శిటీ బి ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు డిజైన్ బై క్వాలిటీ యొక్క వివిధ అంశాలు పై ఇటీవల ప్రచురించిన పేపర్తో ఔషధ పరిశోధనలో గణనీయమైన పురోగతిని సాధించారు. రీసెర్చ్ గైడ్, కె నిత్యానందన్ మార్గదర్శకత్వంలో బి శ్రావణి, జి.కె.ఆర్. వెంకట సుమంత్, ఎం జాహ్నవి, ఎం వినయ్ రెడ్డి మరియు పి.ఇ.డి. నరేంద్ర అనే విద్యార్థులు పరిశోధన పని ప్రారంభించారు. వారి సహకార ప్రయత్నం ఔషధాల తయారీలో డిజైన్ బై డిజైన్ (QbD) యొక్క చిక్కులను పరిష్కరించే సమగ్ర అధ్యయనాన్ని రూపొందించడానికి దారితీసింది. విద్యార్థులు విజయాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ అభినందించారు. డిపార్ట్మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ ఎస్ లిఖిత విద్యార్థులు మరియు మెంటర్ కె నిత్యానందన్ వారి అత్యుత్తమ పనికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ పేపర్ ప్రచురణ ఈ ఔత్సాహిక ఫార్మసిస్ట విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది, ఇది భవిష్యత్ పరిశోధన ప్రయత్నాలకు ఒక ఉదాహరణగా నిలిచింది.

# ఓ.ఎన్.జి.సి. రిగ్‌ను సందర్శించిన జియోసైన్సెస్ విద్యార్థులు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ జియోసైన్సెస్ విద్యార్థులు శుక్రవారం గ్రౌండ్ నాలెడ్జ్ కోసం రాజమండ్రికి సమీపంలో ఉన్న మండపేట ప్రాంతంలో వేరు వేరు చోట్ల సహజ వాయువు (నాచురల్ గ్యాస్) లభించే ఓ ఎన్ జి సి వెలికితిస్తున్న స్థలాన్ని (రిగ్) సందర్శించారు. ప్రాథమికంగా ఆ స్థలంలో వివిధ పద్ధతుల్లో సర్వే నిర్వహించి వాటి ఫలితాలతో డ్రిల్లింగ్ చేస్తారు. అలా డ్రిల్లింగ్ జరిగాక వాటిలోంచి వచ్చే సహజ వాయువుని వొడిసిపడతారు ఈ ప్రక్రియని వెల్ లాగింగ్ అంటారని, రిగ్ సైట్లో జియో సైన్సెస్ విద్యార్థులకు నిపుణులు వివరించారు. రిగ్ లో ప్రక్రియల్లో వాడే విభిన్న వస్తువులు, కెమికల్స్, మెషీన్, అవి పనిచేసే పద్ధతి,డ్రిల్లింగ్ ఐయాక వచ్చిన పదార్థాల విభజన, విభజించిన వాటినీ లాబ్ పంపాల్సిన నమూనాలుగ మార్చడం వంటి విషయాలను విద్యార్థులు తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జియో సైన్స్ విభాగాధిపతి ఆచార్య వై శ్రీనివాసా రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకినాడ క్యాంపస్ పొలిటికల్ సైన్స్ స్టడీ టూర్




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ పొలిటికల్ సైన్స్ మరియు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ కోర్స్ కోఆర్డినేటర్ డా. కే.జోసఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో విభాగ విద్యార్థులకు కాకినాడ నగరంలోని గాంధీ భవన్ ను సందర్శించారు. గాంధీజీ జీవిత చరిత్ర విశేషాలను గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ విభాగ విద్యార్థులకు వివరించారు. పొలిటికల్ సైన్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు గాంధీజీ జీవిత చరిత్రలోని ముఖ్య పోరాటాలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యంగా కాకినాడ ప్రాంతంలో స్వాతంత్రోద్యమంలో గాంధీతో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ సహాయ ఆచార్యులు డా.ఎం.నాని బాబు, డా. కే.హరిబాబు, డాక్టర్ కె.స్వామీజీ మరియు విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని గాంధీజీ రచనలను,పలు అంశాలపై తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు.



## గూడెంలో ఎంబీఏ ఫ్రెషర్స్ పార్టీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలను మార్గదర్శకాలను తెలియజేశారు అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

## మ్యాథమెటిక్స్ ఫ్రెషర్స్ పార్టీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. విభాగ అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.



# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.పద్మరాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు




డా. రేకపల్లి శ్రీనివాసరావు
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్
రేకపల్లి ఎన్విరాన్మెంటల్ సొల్యూషన్స్ అండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్




విజయ కుమార్, వైస్ ప్రెసిడెంట్
జివి గుప్తా, సీనియర్ ఎగ్జిక్యూటివ్
నింబస్ ఆన్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు




మనోజ్ పరాక్, చైర్మన్, ఐ.సి.ఎస్.ఐ, విశాఖపట్నం చాప్టర్

# ప్రకృతిని ప్రేమిద్దాం!జీవరాశులను కాపాడుకుందాం!!



పర్యావరణమనేది ఉమ్మడి ఆస్తి. మానవులు, జంతువులు మొక్కలు, చెట్లు మరియు పక్షులు, చేపలు ఇలా ప్రపంచంలోని అన్ని జీవరాశులు పర్యావరణాన్ని ఉపయోగించుకుంటున్నాయి. అనుభవిస్తున్నాయి. కానీ మానవులు తమ అత్యాశతో ఈ ఉమ్మడి వనరులను కావలసిన దానికన్నా ఎక్కువగా వినియోగించుకుంటూ ఇతర జీవరాసుల మనుగడకు హాని కలిగిస్తున్నారు.

ఆర్టికల్ 51 %శా(స్త్ర%) ప్రకారం అడవులు, సరస్సులు, నదులు మరియు వన్యప్రాణులతో సహజ పర్యావరణాన్ని రక్షించటం మరియు మెరుగుపరచడం ,జీవుల పట్ల దయ కలిగి ఉండటం భారతదేశంలోని ప్రతి పౌరుడి విధి అని భారత రాజ్యాంగంపేర్కొంది .

మార్చి 24 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం గా జరుపుకుంటున్నాం. పిచ్చుకలు ఒకప్పుడు మనందరి వాకిళ్లలో గుంపులు గుంపులుగా షికారులు కొట్టిన దృశ్యాలు మనకు గుర్తుంటాయి జననివాసాలతో మమేకమై ఉండేవి. పెంకుటిల్లు,తాటాకిళ్ళల్లో గూళ్ళు పెట్టి పిల్లలు చేసేవి. ఆ పిల్లలకు రెక్కలు వచ్చి ఎగిరేంతవరకు జాగ్రత్తగా పెంచేవి ఇటువంటి దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తాయి.

పిచ్చుకలు పంట చేలలో, పల్లె ముంగిళ్ళలో ,దాన్యపురాసుల్లో కిలకల మంట సందడి చేసేవి కానీ నేడు ఈ పరిస్థితి లేదు దీనికి కారణం మానవులు పెంచుకుంటున్నాం సాంకేతిక పరిజ్ఞానం వీటి మనుగడకు శాపంగా మారింది. సెల్ తరంగాలు,రేడియేషన్ కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుంచి కనుమరుగవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెంకుటిల్లు ,పాకలు, పూరి ఇల్లు కనుమరుగయ్యాయి పిచ్చుకలు గూళ్లు లు పెట్టుకోవడానికి చోటు లేదు. ఇంకా పట్టణ ప్రాంతాలలో అయితే అపార్ట్మెంట్ కల్చర్ వచ్చేసింది పక్షులే కనిపించడం లేదు.

నాలుగు సంవత్సరాల క్రితం నేను మా ఇంటి సూరికి వద్ద కుచ్చును పిచ్చుకల కోసం ఏర్పాటు చేశాను ఆహారం కోసం రెండు పిచ్చుకలు వచ్చాయి ,తర్వాత సంవత్సరం నుంచి నాలుగు పిచుకలు రావడం మొదలుపెట్టాయి, ఆ తరువాత ఆరు పిచ్చుకలు ,ఈ సంవత్సరం 10 పిచ్చుకల పైనే మా ఇంటికి వస్తున్నాయి నాకు చాలా సంతోషంగా అనిపించింది. వాటికి ఆహారంకోసం నూకలను మరికొన్ని వడ్ల కుచ్చులను ఏర్పాటు చేశాను.

మనం పిల్లలకు ఇటువంటి మంచి పనులు అలవాటు చేయాలి వారిని ప్రకృతి ప్రేమికులిగా తయారు చేయాలి.

జీవవైవిద్యానికి పొంచి ఉన్న ముప్పును గ్రహించిన పర్యావరణ ప్రేమికుడు మహమ్మద్ దిలవార్ ప్రత్యేకంగా పిచ్చుకల మనుగడకు కృషి చేయటం వల్ల 2010 మార్చి 20 నుంచి పిచ్చుకల దినోత్సవం గా జరుపుతున్నాం. ఈరోజున పర్యావరణ ప్రేమికులకు అవార్డులను ఇవ్వడం జరుగుతుంది.

మార్చి 21 ప్రపంచ అటవీ దినోత్సవం గా 2013 నుంచి ప్రపంచ దేశాలు నిర్వహిస్తున్నాయి. అడవులు అత్యంత ప్రాధాన్యత కలిగిన సహజ వనరులు .ఇవి నీరు గాలి వలే చాలా ముఖ్యమైనవి అడవులు సాంఘిక ,ఆర్థిక పర్యావరణపరమైన ముఖ్య విధులను నిర్వహిస్తుంటాయి. ఆక్సిజన్ ఉత్పత్తి చేసే జనాకాలుగాను, ఓజోన్ పోరను రక్షించే కారకం ,గాను వర్షం కురవడానికి ,శీతోష్ణస్థితి క్రమబద్ధం చేయడానికి, వైద్యానికి పనికి వచ్చే మూలికలను, కలపను కాగితాన్ని తయారు చేసే కర్రను, వంటచేరకను అందించే ప్రధాన వనరులు అడవులు. కాలక్రమేనా అటవీ ప్రాంతం తగ్గుతూ వస్తుంది అందువల్ల పర్యావరణంలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. అడవులు ఎన్నో కారణాల వలన క్షీణతకు గురవుతున్నాయి. పెద్దపెద్ద ఆనకట్టలు,ప్రాజెక్టులు నిర్మాణం వల్ల రోడ్లు ,రైల్వే ,జనాభా పెరుగుదల ,కలప కోసం అడవుల నరికివేత అతి ముఖ్యమైన కారణంగా చెప్పవచ్చు.

అడవులను కాపాడడం కోసం ఉత్తరాఖండ్లోని మహిళా కోలీలు అడవుల నరికివేతను చిప్కో ఉద్యమం ద్వారా ఆపగలిగారు. 1974 మార్చి 26న ప్రారంభమైంది .చెట్లను నరికివేతకు గురికాకుండా చెట్లను కౌగిలించుకొని వాటిని నరికివేతను అడ్డుకున్నారు అమృతా దేవి అనే స్త్రీ రాజభటుడు అనే చెట్టు నరకడాన్ని అడ్డుకోవడంతో ఈ చిప్కో ఉద్యమం ప్రారంభమైంది. దీనిని ఆదర్శంగా తీసుకొని మధ్యప్రదేశ్ వింధ్య సాత్పురా, కేరళ ప్రాంతాలలో అడవులను నరికివేతను ప్రజలు వ్యతిరేకించి కాపాడుకున్నారు. అడవులు ప్రకృతి సౌందర్యాల ఖజానాలని అంటారు వాటి ప్రాధాన్యతను గుర్తించి వాటిని సంరక్షించుకోవలసిన ఆవశ్యకత మనపై ఉంది.

ప్రపంచ నీటి దినోత్సవం మార్చి 22న జరుపుతాయి ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తాయి. ఇది మంచినీటి ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. భూమిపై నివసించే జీవరాసులకు నీరు ఎంతగానో అవసరం నీటిని నీటి బంగారం అని కూడా అంటారు భూమి అంటారు. భూమి మీద ఉండే నీటిలో 97% నీరు సముద్రంలో ఉంది మిగతా 0.003% చాలా కొద్ది పరిమాణంలో మాత్రమే మానవాళి ఉపయోగానికి లభిస్తుంది. మీరు అత్యంత విలువైన వనరుగా పరిగణిస్తారు అందుకే నీరు లేకపోతే భూమిపై అసలు జీవమే ఉండదు. సరస్సులు, నదులు ,సెలయేళ్లు ,చెరువులు, సముద్రాలు ఆనకట్టలు జలధారాల్లో నిల్వ చేసిన నీరునీ ఉపరితల నీటి వనరులు అని కూడా అంటారు. బావులు,గొట్టపు బావులలో నీరును భూగర్భ జలాలని అంటారు. మానవులు ఈ భూగర్భ జలంలలో నీటిని ఉపయోగించుకుంటూ ఉపరితల నీటి వనరులను కలుషితం చేస్తున్నారు. దీని ద్వారా భూమిపై ఉన్న జంతువులు, పక్షులు, ఇతర జీవప్రాణులు మృత్యువాత పడుతున్నాయి.

మానవుల నివసించే భవంతులలో సౌకర్యాలు పెరగటం వల్ల నీటి వినియోగం మరింత పెరిగింది . భవిష్యత్ తరాలకు నీరు అనే వనరు లేకుండా పోతుంది మానవుని సుఖాల కోసం భూమి పై ఉన్న నీరు అంతా ఉపయోగించుకుని కలుషితం చేసి ఇతర జీవుల జీవన విధానానికి హాని చేస్తున్నాం అన్ని జీవులకు చెందవలసిన ఉమ్మడి ఆస్తిని మానవులు మాత్రమే అనుభవిస్తున్నారు మనతోపాటు ఇతర జీవరాశులు కూడా ప్రకృతి పర్యావరణం పై హక్కులున్నాయి పర్యావరణ పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎన్నో న్యాయబద్ధమైన చట్టపరమైన మరియు పరిపాలన సంబంధ ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఆచరణ కు నోచుకోవటం లేదు. మానవ నిర్మితమైన కట్టడాలు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు కానీ ఆనందాన్ని ఇవ్వలేవు. ప్రకృతిలోని కొన్ని దృశ్యాలను చూసినప్పుడు జంతువులని, పక్షులను ,నీటి సెలయేర్లను, పెద్దపెద్ద చెట్టులను ,కొండలను చూసినప్పుడు మనసుకి ఎంతో ఆహ్వాదకరంగా ఆనందాన్ని ఇస్తాయి. హక్కులతో పాటు మానవులకు కొన్ని విధులు కూడా ఉన్నాయి అని గుర్తించి వాటిని బాధ్యతతో నిర్వర్తించాలి.

- దీప్తి,
పొలిటికల్ సైన్స్, బిఎడ్,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

# తూర్పుగోనగూడెంలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్.ఎస్.ఎస్ విభాగం -2 ఆధ్వరంలో తూర్పు గోనగూడెం గ్రామంలో ఈనెల 18 నుండి 24 వరకు ఎన్.ఎస్.ఎస్. స్పెషల్ క్యాంపును విభాగం - 2 ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.ఎమ్. శిరీష నిర్వహించారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన స్పెషల్ క్యాంపులో మొదటి రోజు ప్రధానోపాధ్యాయులు ఎం. పద్మజారాణి సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు లెనోరా డెంటల్ కాలేజ్ వారి సహకారంతో డెంటల్ క్యాంప్ ను, మూడో రోజు విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. నాల్గవ రోజు సామాజిక పరిస్థితులపై సర్వే ఐదో రోజు ఓటు హక్కు ప్రాధాన్యత తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆరవ రోజు వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఏడవ రోజు గ్రామంలోని స్వచ్ఛతా ప్రోగ్రామ్ మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. స్పెషల్ క్యాంప్ నిర్వహణకు సహకరించిన వీసీ ఆచార్య కె పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ లకు పిఓ శిరీష కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి వెంకటేశ్వరరావు, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ. ఎం శిరీష, డా.బి.అప్పలరాజు, కోర్సు కోఆర్డినేటర్ బి సుధాకర్, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# బోటనీ విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బోటనీ విభాగం సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు విశ్వవిద్యాలయ వసతులు వనరుల తెలియజేస్తూ పలు సూచనలు మార్గదర్శకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. దీనిలో ప్రకృతి సిద్ధంగా సెమినార్ హాల్ ను అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## మంచిమాట

మన జీవన చిత్రాన్ని మనకు నచ్చినట్టు చిత్రించుకునే హక్కు మనకుంది. దానిని చూసి పది మంది ప్రేరణ పొందేలా జాగ్రత్త పడవలసిన బాధ్యత కూడా మనకుంది.

- వారెన్ బఫెట్

# ఓటు హక్కుపై అవగాహన




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ కు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, యూనిట్ - 2లు మరియు B.Ed కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ వారు తమ తమ దత్తత గ్రామాలలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ ఎద్యుకేషన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత గ్రామం అయిన చక్రద్వార బంధం రాజానగరం మండలం అలాగే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్1 గ్రామమైన నరేంద్రపురం అలాగే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ అర్ట్స్ అండ్ కామర్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 దత్తత గ్రామం అయిన సూర్యారావుపేటల లో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్ అయిన డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ అలీస్ జాయ్, డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఓటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పాటు గ్రామ అధికారులు గ్రామంలోని నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలుగా పీఓ లతో పాటు అధ్యాపకులు జె.సూరయ్య డాక్టర్ పి. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎం. రమేష్ పాల్గొన్నారు.




## మేనేజ్మెంట్ విద్యార్థులకు అవగాహన సదస్సు



ఐ.సి.ఎస్.ఐ., విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ మనోజ్ పరాక్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. చార్టెడ్ ఖాతాల కోసం కెరీర్ ఎంపికలు మరియు ఉపాధి అవకాశాలపై ప్రసంగించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విద్యార్థులు హాజరయ్యారు. దీనిలో ఏఓ తాతారావు విద్యార్థుల నిబద్ధత మరియు ఉన్నత ఆకాంక్షల వైపు ప్రేరేపించే అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా ఎన్ ఉదయ్ భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఈసీఈ ప్రాజెక్ట్ ఎక్స్పో







ఆదికవి నన్నయ యూనివర్సిటీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్స్ కోఆర్డినేటర్ బి. సుధాకిరణ్ ఆధ్వర్యంలో, ఇన్నోవేషన్ హబ్ కోఆర్డినేటర్ అధ్యాపకులు బి. యని కెజియ, బుధవారం ప్రాజెక్ట్ ఎక్స్పో 2కె24 ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాల్గవ సంవత్సర విద్యార్థులు వారి ప్రాజెక్ట్స్ను ప్రదర్శించారు. ఎమ్ సి ఎ మరియు ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ప్రాజెక్టులు నుండి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు నేర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.వి. పెర్సిస్ డైరెక్టర్, ఐ.క్యూ.ఎ.సి మరియు యూనివర్సిటీ కాలేజ్ అఫ్ ఇంజనీరింగు నుండి ప్రిన్సిపల్ డా. పి. వేంకటేశ్వర రావు తో పాటుగా యూనివర్సిటీ కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ అన్ని డిపార్ట్మెంట్స్ యొక్క కోర్స్ కోఆర్డినేటర్స్ మరియు స్టాఫ్ పాల్గొన్నారు. ప్రాజెక్ట్ ఎక్స్పోలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు ఎస్. రాజేష్, కె. జయంత్ రామ్, తిరుమలదేవి లకు ప్రిన్సిపల్ జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలియజేశారు.



## అడవితల్లి ఆవేదన

వెన్నెల రేయి ...
వెచ్చని హాయి..
పచ్చని ప్రకృతి
 జీవ వనాన్ని విడిచి,

చెట్టుని కొట్టి జన జీవనానికి
నిర్మించినారు నిర్జీవ మేడలు నగరాలు....

మనుష్య తరాలు పెరిగే,
పరువునిలుపు
తరువు తరాలు తరిగే...

స్వయం పోషకులం.
సాయం చేసే సేవకులం
వనమూలికల అమృత భాండాగారం
సకలసృష్టికి వైద్యారోగ్య హారం...

మండేఎండకు నీడనైతిని...
పెళ్లంటే పచ్చని తోరణమైతిని..
విందుకు విస్తరైతిని...
నీ నిద్రకు మంచమైతిని...
తనువు చాలిస్తే మోసే కాడినైతిని..
కాల్చే కట్టెనైతిని...

కిల కిల పక్షుల గూడునైతిని
విభిన్న జీవజాతికి తోడునైతిని...

నేనిచ్చు వాయువు మీకు ఆయువైనను,
జననమొందిన ఉన్నత జీవానికి మాపై జాలి లేదే...

విత్తు నాటలేదు
నీరు పెట్టలేదు
అంతా మీ సొత్తైనట్టు
మా బ్రతుకులపై గొడ్డలి వేటు,
ఎవరిచ్చారు మాపై మీకు హక్కు...
ముందుంది భవిష్యత్ తరాలకు ముప్పు .

మీ వికృత చర్యను భరిస్తున్న బానిసలం..
మాకే కరములు ఉంటే
ఆపెదమే,
రెక్కలు ఉంటే ఎగిరెదమే...


మేము లేకుంటే జీవ మనుగడకు ముప్పు..
పెట్టకు వృక్ష జాతికి నిప్పు,
ఇకనైనా తెలుసుకో నీ తప్పు..
మొక్కను పెంచు...హాయిగా జీవించు ..

- వెంకటేశ్వరరావు గొడుగు,
ఎమ్మెస్సీ బోటనీ,అనూర్.

# వన సంరక్షణ

అడవులు భూమిపై జీవానికి పర్యాయపదాలు. అవి మన ఆక్సిజన్, నివాసం, ఆహారం, కలప, గుర్తింపు మరియు సంస్కృతికి మూలం. మన సంస్కృతి ప్రకారం చెట్లను కొన్ని యుగాల నుంచి పూజించి ఆరాధిస్తున్నాం. త్రేతాయుగంలో రాముడు తండ్రి మాటకు, ద్వాపర యుగంలో పాండవులు ధర్మానికి కట్టుబడి వనవాసం చేశారు. సీత కూడా లంకావనంలో చెట్టు కింద కూర్చొని తన భర్త కోసం ఎదురు చూసింది. ఐజాక్ న్యూటన్ తన 'యురేకా' క్షణాన్ని పొందింది ఒక చెట్టుక్రిందే.రావిచెట్టు నీడలో బుద్ధుడు జ్ఞానోదయం పొందినట్లు బౌద్ధ సాహిత్యం చెబుతోంది. చెట్టు అనేది అన్ని జీవరాశులకు ఆశ్రయం, ఆహారం,రక్షణ కల్పించే అద్భుతమైన విషయం. దానిని నాశనం చేసేవారికి అది నీడను కూడా అందిస్తుంది.

"వృక్షో రక్షతి రక్షితః" వృక్షాలను మనం రక్షిస్తే తిరిగి అవి మనల్ని సంరక్షిస్తాయి. కానీ నేడు ఆ వృక్షాలకే రక్షణ లేకుండా పోతుంది. వృక్షాలతో నిర్మితమైన అడవులు ప్రపంచవ్యాప్తంగా నేడు ముప్పులో ఉన్నాయి. తద్వారా పశుపక్షాదుల జీవన ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ బెదిరింపులు అటవీ నిర్మూలన మరియు అటవీ క్షీణత రూపంలో వ్యక్తమవుతున్నాయి. పోడు వ్యవసాయం మరియు రహదారి నిర్మాణం వంటి అరణ్యేతర ఉపయోగాలకు మార్చబడినప్పుడు అటవీ నిర్మూలన జరుగుతుంది. అటవీ పర్యావరణ వ్యవస్థలు ప్రజలకు మరియు ప్రకృతికి ముఖ్యమైన వస్తువులు మరియు సేవలను అందించే సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు అటవీ క్షీణత సంభవిస్తుంది.



ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉష్ణమండల అడవులలో సగానికి పైగా 1960 నుండి నాశనం చేయబడుతున్నాయి. ప్రతి సెకనుకు ఒకటి కంటే ఎక్కువ హెక్టార్ల ఉష్ణమండల అడవులు నాశనమవుతున్నాయి, తీవ్రంగా క్షీణించబడుతున్నాయి. 2010 నుండి ఈ దశాబ్దంలో, ప్రపంచవ్యాప్తంగా అడవులలో నికర నష్టం సంవత్సరానికి 4.7 మిలియన్ హెక్టార్లు. అయితే, అటవీ నిర్మూలన చాలా ఎక్కువగా ఉంది. ఐక్యరాజ్యసమితి యొక్క ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం 10 మిలియన్ హెక్టార్ల అడవులు నరికివేయబడుతున్నాయి. ఫలితంగా అడవుల క్షీణించి అనేక వృక్ష జంతుజాల మనుగడకు ముప్పు కలుగుతుంది. స్వచ్ఛమైన గాలి,నీరు,వ్యవసాయానికి ఆరోగ్యకరమైన నేలలు, వాతావరణ నియంత్రణ వంటి అవసరమైన సేవలను అందించే అడవుల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది.

వాతావరణ మార్పుల అనుసరణ ప్రయత్నాలలో అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచంలోని అడవులు సంవత్సరానికి 2.4 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ను గ్రహిస్తాయి. ఇవి క్లైమేట్ షాక్ ల సమయంలో ఆహార భద్రతా వలయంగా పనిచేస్తాయి, తీరప్రాంత వరదలు వంటి విపత్తుల నుండి ప్రమాదాలను తగ్గిస్తాయి. నీటి ప్రవాహాలు మరియు మైక్రోక్లైమేట్లను ని య ం త్రి ం చ డ ం లో సహాయపడతాయి.అటవీ పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, స్థిరమైన నిర్వహణ పద్ధతులను ప్రవేశపెట్టడంవల్ల వాతావరణ మార్పుల ప్రభావాలకు మానవ సహజ వ్యవస్థల స్థితిస్థాపకత పెరుగుతుంది.

ఆరోగ్యకరమైన అడవులు ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్ల ప్రజల జీవనోపాధికి మద్దతు ఇస్తున్నాయి.వీరిలో ఒక బిలియన్ ప్రపంచంలోని అత్యంత పేదవారు ఉన్నారు. అటవీ నిర్మూలన,అటవీ క్షీణత ఈ బలహీన వర్గాల జీవితాలపై నిజమైన, స్పష్టమైన ప్రభావాలను చూపుతాయి. ఉదాహరణకు, ఆహార ఉత్పత్తికి ఉపయోగించే మొత్తం భూమిలో 52 శాతం ఆరోగ్యకరమైన నేలకోత వల్ల మధ్యస్తంగా లేదా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ప్రకృతి దృశ్యం నుండి చెట్లను తొలగించినప్పుడు ఇది సంభవిస్తుంది, ఇది ఆహార అభద్రతకు దారితీస్తుంది. 2100 నాటికి ప్రపంచ జనాభా 10.8 బిలియన్లకు చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది.

పారిస్ ఒప్పందం యొక్క లక్ష్యం నెరవేరాలన్న, అంతర్జాతీయ అటవీ దినోత్సవం 2024 యొక్క థీమ్ "అడవులు మరియు ఆవిష్కరణ: మెరుగైన ప్రపంచానికి కొత్త పరిష్కారాలు" సాధించాలంటే మొదట అడవులను సమగ్రంగా పరిగణించడం, విలువ ఇవ్వడం చేయాలి. ప్రతి మనిషి విధిగా మొక్కలు నాటి అవి బ్రతికే వరకు సంరక్షణ చేయాలి. ఇటీవల ముంబై నగరవాసులు ఒక మంచి నిర్ణయం తీసుకున్నారు. వారు తిన్న పండ్ల విత్తనాలను రోడ్లకు ఇరువైపులా చల్లటం చేయడం మొదలుపెట్టారు. ఇది మంచి శుభ పరిణామం. మానవులు అడవుల యొక్క బహుళ పర్యావరణ, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలను వాటి అంతర్గత విలువతో పాటు అభినందించినప్పుడు తప్పకుండా పైన పేర్కొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మొక్కే కదా అని పీకేస్తే పీక కోస్తా!నంటాడు సినీ హీరో. అంటే ఆ మొక్క విలువ 50 సంవత్సరాలు జీవించి 5.3 లక్షల విలువైన ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుంది, 6.4 లక్షల విలువైన భూసారాన్ని రీసైకిల్ చేస్తూ మట్టి కోతను నియంత్రణను సులభతరం చేస్తుంది, 10.5 లక్షల విలువైన వాయు కాలుష్య నియంత్రణను సృష్టిస్తుంది. పశు పక్షాదులకు 5.3 లక్షల విలువైన ఆశ్రయాన్ని అందిస్తుంది. అదనంగా, ఇది పువ్వులు మరియు పండ్లను కూడా అందిస్తుంది. కాబట్టి ఒక చెట్టు పడిపోయినప్పుడు లేదా నరికితే, నగరం యొక్క నికర నష్టం 33 లక్షల కంటే ఎక్కువ. కాబట్టి చెట్టును నరికే ముందు ఒక్కసారి ఆలోచించండి! ఈరోజే మీ ఆక్సిజన్ ను నాటండి!! ఇది మనందరి బాధ్యత!!!

- డా.ఎల్.ముత్యాలనాయుడు
బోటని డిపార్ట్మెంట్,ANUR

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in